క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేములవాడరూరల్: మండలంలోని మల్లారం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ రాకేశ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు విని యోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

విప్ ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

కోనరావుపేట: మండలంలోని కొలనూర్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ సంకినేని రాంమోహన్‌రావు, నాయకులు, ఫిరోజ్ పాషా, వీరవేణి తిరుపతి, వెంకన్న, మల్యాల నాయకులు రాఘవరెడ్డి సతీశ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



కోనరావుపేట: మండలంలోని పల్లిమక్తలో నూతనంగా నిర్మించిన శ్రీ దుర్గాంబిక ఆలయంలో శుక్రవారం నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు. ఈ ఉత్సవాలు 23వరకు జరుగుతాయన్నారు. గ్రామంలో శోభాయాత్ర, కలశ యాత్ర తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

పుస్తకం ఆవిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

బోయినపల్లి: కొలనూర్‌లో తెలుగు పండిట్‌గా పనిచేస్తున్న గుర్రం అంజయ్య రచించిన హంస నీతి శతకం పుస్తకాన్ని మండలంలోని విలాసాగర్ హైస్కూల్‌లో ఎంఈవో శ్రవణ్‌కుమార్ గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బోయినపల్లి, విలాసాగర్ హెడ్‌మాస్టర్లు కొను భూమయ్య, బొలగం శ్రీనివాస్, బోయినపల్లి, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పండితులు రచనలు చేయాలి

ఎల్లారెడ్డిపేట: పండితులు విద్యాభివృద్ధికి ఉపయోగపడేలా రచనలు చేయాలని ఎంఈవో కృష్ణహరి అన్నారు. మండలంలోని వెంకటాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గుర్రం అంజయ్య రచించిన హంసనీతి శతకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. పండితులు ఇలాంటి రచనలు చేయాలని విద్యార్థులు సైతం రచనలు చేసే విధంగా ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సన్మానం



ఎల్లారెడ్డిపేట: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన రెడ్డబోయిన గోపిని మండల పార్టీ నాయకులు గురువారం సన్మానించారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని గోపి కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చందుపట్ల లక్ష్మారెడ్డి, నాయకులు దీటి నర్సయ్య, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన రొడ్డవేని గోపిని మండలంలోని నీలోజిపల్లి బీజేపీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన నాయకులు, తదితరులు ఉన్నారు.

ఆలయంలో చోరీ

ముస్తాబాద్: మండలంలోని మొర్రాయిపల్లె చౌడాలమ్మ ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. పూజారి గురువారం ఉదయం ఆలయానికి వెళ్లగా, ఆలయ తలుపులు తెరిచి ఉన్నాయి. హుండీ, గంట ఇతర వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లారు. చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ దమ్మ మల్లేశం తెలిపారు.

సెంట్రల్ లైటింగ్ లేక పరేషాన్

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందిపడుతున్న వాహనదారులు
- సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి



వేములవాడ - సిరిసిల్ల ప్రధాన రహదారి

వేములవాడఅర్బన్: దక్షిణకాశీగా ప్రసిద్ధి గాంచిన వేములవాడ రాజన్న ఆలయానికి భక్తులు నిత్యం పెద్ద ఎత్తున తరలివస్తుంటారు. నాలుగు వరుసల రహదారులు ఏర్పాటు చేసినప్పటికీ డివైడర్ మధ్యలో సెంట్రల్ లైటింగ్ మాత్రం మరిచారు. వేములవాడ – సిరిసిల్ల ప్రధానరహదారిలో రగుడు జంక్షన్ నుంచి నందికమాన్ వరకు నాలుగు వరుసల రోడ్డులో డివైడర్ ఏర్పాటు చేసి పూలమొక్కలు నాటారు. కాని సెంట్రల్ లైటింగ్‌కు మోక్షం కలగడం లేదు. రాత్రిపూట చీకట్లో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు.

రాత్రిపూట రోడ్డు ప్రమాదాలు..

వేములవాడ – సిరిసిల్ల ప్రధానరహదారిలో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. రాత్రిపూట ద్విచక్రవాహదారులకు రోడ్డు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుటుంటున్నాయి. అలాగే చంద్రగిరి, అగ్రహారం, గుర్రవానిపల్లి, చీర్లవంచ ప్రజలు రోడ్డు దాటాలంటే జంకుతున్నారు. ఇప్పటికైనా అధికారులు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కొడుముంజ వరకు ఏర్పాటు చేయాలి

నందికమాన్ నుంచి కొడుముంజ శివారు వరకు నాలుగు వరుసల రోడ్డు ఉంది. కానీ డివైడర్ మధ్యలో పూలమొక్కలు నాటడం మరిచారు. అలాగే సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

లైట్లు వెలగడం లేదు

వేములవాడ నందికమాన్ నుంచి ఏరియా ఆస్పత్రి వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసినప్పటికీ కొన్నిచోట్ల మాత్రమే వెలుగుతున్నాయి. అక్కడక్కడ మహాశివరాత్రి జాతర సమీపిస్తుండటంతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మొక్కలు నాటాలి



నందికమాన్ నుంచి కొడుముంజ గ్రామం వరకు డివైడర్ మధ్య పూలమొక్కలు నాటాలి. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు.

– నేర్ల రామకృష్ణ, కొడుముంజ

చీకటిమయంగా ఉంది



వేములవాడ పట్టణంలోని ఓ దుకాణంలో పనిచేస్తున్నా. రోజు రాత్రి వేములవాడ నుంచి సిరిసిల్లకు ద్విచక్ర వాహనంపై వెళ్తా. రాత్రి పూట నందికమాన్ నుంచి రగుడు వరకు సెంట్రల్ లైటింగ్ లేకపోవడంతో అంధకారం నెలకొంది. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి.

– సాయికుమార్, సిరిసిల్ల

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రం శివారు గురువారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఆరుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని 25 వాహనాలకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్సై రమాకాంత్ మాట్లాడుతూ.. ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యంతాగి వాహనాలు నడిపితే జైలుకెళ్లడం ఖాయమన్నారు. తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిపేటలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

పాడి రైతులను ఆదుకోవాలి



గంభీరావుపేటలో ధర్నా చేస్తున్న పాడి రైతులు



కోనరావుపేట : కనగర్తిలో రైతుల ఆందోళన

ముస్తాబాద్: పాడి రైతులను ఆదుకోవాలంటూ గంభీరావుపేట మండల కేంద్రంలో గురువారం రైతులు ఆందోళన చేపట్టారు. అగ్రహారంలో డెయిరీని సీజ్ చేయడాన్ని నిరసిస్తూ పాడి రైతులు గంభీరావుపేట ప్రధాన రహదారిపై పాల క్యాన్లతో బైఠాయించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రైతులకు ఉపాధి కల్పిస్తున్న డెయిరీని సీజ్ చేయడం అన్యాయమన్నారు. పాడి రైతులను వెంటనే ఆదుకోవాలని కోరారు. పాలను సేకరించే వారు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు.

కోనరావుపేట: మండలం కనగర్తిలో పాల ఉత్పత్తిదారులు గురువారం రాత్రి ఆందోళన చేశారు. అగ్రహారంలోని కరీంనగర్ డెయిరీ పాల శీతలీకరణ కేంద్రాన్ని జిల్లా అధికారులు సీజ్ చేయగా మండలంలోని అన్ని గ్రామాల్లో పాల సేకరణ కేంద్రాలు తెరచుకోలేదు. పాలు పోసేందుక వచ్చిన రైతులు ఆందోళన చేపట్టారు. పాలు తీసుకోకపోవడంతో మారుపాక రాజయ్య అనే రైతు పాలను వృథాగా పారబోశాడు. అధికారుల చర్యలతో పాల ఉత్పత్తిదారులు ఇబ్బందులు పడుతున్నారని, రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట మండలం సోమారంపేట పాడి రైతులు కరీంనగర్ పాలడెయిరీ ఎదుట నిరసన తెలిపారు. పాలకేంద్రం చైర్మన్ కనకారెడ్డి, డైరెక్టర్ భూమయ్య, పాడి రైతులు ఉన్నారు.

బాధ్యతలు స్వీకరణ



సిరిసిల్లకల్చరల్: పట్టణ మసీద్ కమిటీ అధ్యక్షుడిగా గెలుపొందిన సయ్యద్ సమీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ముంతాజ్ ఈ మేరకు ఆయనకు బాధ్యతలు అప్పగించారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ సమీ కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ కమిటీ మాజీ అధ్యక్షుడు సయ్యద్ సలీం, సయ్యద్ యుసుఫ్, రీనా బాబా, ఖాదర్, రవఫీ, అక్రమ్,సోహెల్, మునీర్, మెహమూద్, అంజద్ తదితరులున్నారు.

ఉచిత గుండె వైద్యశిబిరం

సిరిసిల్లటౌన్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో సిరిసిల్లలో గురువారం ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహించారు. వందమందికి వివిధ పరీక్షలు నిర్వహించారు. జిల్లాలోని ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందించడమే లక్ష్యమని వైద్యుడు శ్రీకాంత్ అన్నారు. బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు

సిరిసిల్లక్రైం: వేములవాడకు చెందిన బాలుడు (11) తప్పిపోయి సిరిసిల్లకు బస్టాండ్ చేరాడు. స్థానికులు వివరాలు అడగగా సైగలు చేశాడు. దీంతో వారు సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్ సమాచారం అందించారు. బాలుడు తప్పిపోయి స్టేషన్‌లో ఉన్నాడని ఆచూకీ తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లో వివరాలు తెలపాలని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్‌చేశారు. గమనించిన బాలుడు తండ్రి బాతుల రాజు స్టేషన్‌కు వచ్చిన వివరాలు తెలుపగా బాలుడిని అప్పగించినట్లు సీఐ కృష్ణ తెలిపారు. బాలుడు మూగ, చెవిటి వాడు కావడంతో వివరాలు వెల్లడించలేదని పోలీసులు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

కోనరావుపేట: మండలంలోని రామన్నపల్లి (బావుసాయిపేట)లో ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన గుంటి భూమయ్య (62) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గురువారం తెల్లవారుజామున ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య లచ్చవ్వ, ముగ్గురు కుమారులు మల్లేశం, పర్శరాములు, ప్రశాంత్ ఉన్నారు. లచ్చవ్వ ఫిర్యాదు మేరకు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

ఇల్లంతకుంట: రాష్ట్రస్థాయి 34వ సబ్ జూ నియర్ కబడ్డీ పోటీలకు మండలంలోని గాలిపెల్లి హైస్కూల్ నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.పావని, వ్యాయామ ఉపాధ్యాయుడు సాన బాబు గురువారం తెలిపారు. బాలుర విభాగంలో తొమ్మిదో తరగతి చదువుతున్న సుధగోని అఖిల్, బుర్ర హర్షవర్ధన్, చక్రాల వినయ్ ఎంపికయ్యారన్నారు. బాలికల విభాగంలో కేశివేని అన్విత, ఎంగ్రడ సంజన ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 23 వరకు వికారాబాద్ జిల్లాకేంద్రంలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో వీరు పాల్గొంటారని ప్రధానోపాధ్యాయురాలు తెలిపారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న మారుతి రెడ్డి

వీర్నపల్లి : మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఇన్‌చార్జి తహసీల్దార్ మారుతి రెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, పీడీ చామంతి, ఇన్‌చార్జి ఏఎస్‌వో పద్మ, మమత ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

ఇల్లంతకుంట: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో గురువారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దళిత సంఘాల నాయకులతో ఎమ్మెల్సీ నరేందర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. మొదటి ప్రాధాన్యంగా ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలం అధ్యక్షుడు రాఘవరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మామిడి సంజీవ్, దళిత సంఘాల నాయకులు దండి రవీందర్, బోలు మల్లసదానందం, దామరసత్యం, పులి సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

బోయినపల్లి: మండలంలోని మల్లాపూర్‌లో పీడీఎస్ బియ్యంతో పట్టుబడిన కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం రేకుర్తి గ్రామానికి చెందిన కల్యాణ్ చక్రవర్తిని గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై దూలం పృథ్వీధర్ గౌడ్ తెలిపారు. గ్రామ పరిసరాల్లో పోలీసులు తనిఖీ చేపట్టగా బుధవారం కల్యాణ్ చక్రవర్తి 13 బ్యాగుల పీడీఎస్ బియ్యంతో పట్టుబడినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నేడు ఎమ్మెల్యే సమావేశం

బోయినపల్లి: కాంగ్రెస్ మండల కార్యకర్తలతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శుక్రవారం సన్నాహక సమావేశం నిర్వహిస్తారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు.

సంక్షిప్త వార్తలు

● **ఆర్టీఏ కార్యాలయంపై దాడిచేసిన వ్యక్తి అరెస్ట్**

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల రవాణాశాఖ కార్యాలయంపై దాడిచేసిన పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన నాగరాజును రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ గురువారం తెలిపారు. గత మంగళవారం ఆర్టీఏ అధికారులు సాధారణ తనిఖీల్లో చేపట్టగా సిరిసిల్ల పరిధిలో ఫ్లైయాష్‌తో అధిక లోడ్‌తో వెళ్తున్న రెండు లారీలను అధికారులు పట్టుకుని వాటిని బస్సు డిపోకు పంపించారు. దీంతో నాగరాజు ఆర్టీఏ కార్యాలయానికి చేరుకుని సిబ్బందిపై దాడిచేసి కార్యాలయంలో ఫర్నీచర్ ధ్వంసంచేశాడు. అధికారులపై జరిగిన దాడిపై ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేసిన అనంతరం నాగరాజును రిమాండ్ తరలించినట్లు సీఐ కృష్ణ తెలిపారు.

● **ఎమ్మెల్సీఅభ్యర్థి శేఖర్‌రావుకు మద్దతుగా ప్రచారం**

ఎల్లారెడ్డిపేట: ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు గెలుపునకు కృషి చేయాలని ప్రైవేట్ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు తెడ్డు రవి కోరారు. మండలకేంద్రంలోని విజ్ఞాన్ పాఠశాలలో గురువారం శేఖర్‌రావుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శేఖర్‌రావుకు పట్టభద్రులు ప్రాధాన్యంగా ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎండీ లతీఫ్, ప్రధానోపాధ్యాయుడు శరత్‌కుమార్, సంతోష్‌కుమార్, పీఈటీ భరత్‌కుమార్, రాకేశ్, తదితరులున్నారు.

● **కాంగ్రెస్ అభ్యర్థిని ఎమ్మెల్సీగా గెలిపించండి**

సిరిసిల్లకల్చరల్: రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డిని గెలిపించాలని ఎన్నికల ఇన్‌చార్జి బల్మూరి వెంకట్ కోరారు. గురువారం ఆయన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు నాగుల సత్యనారాయణతో కలిసి న్యాయవాదులతో భేటీ అయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థికే తొలి ప్రాధాన్యంగా ఓటు వేయాలని కోరారు.

● **సన్మానం**

కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లి మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఏఎంసీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్యను గురువారం ఘనంగా సన్మానించారు. ఎల్లయ్య ఇటీవల నిజామాబాద్ మార్కెట్ చైర్మన్‌గా పదవీబాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సాసాల రాజారాం, డైరెక్టర్ సాసాల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **ఇన్‌చార్జి వ్యవసాయాధికారిగా దుర్గరాజు**

ముస్తాబాద్: మండల వ్యవసాయాధికారిగా దుర్గరాజు బాధ్యతలు చేపట్టారు. ముస్తాబాద్ వ్యవసాయాధికారిణి అనూష చందుర్తికి డెప్యూటేషన్‌పై బదిలీ అయ్యారు. చందుర్తి ఏవోగా పనిచేసిన దుర్గరాజు ముస్తాబాద్‌కు డెప్యూటేషన్‌పై వచ్చారు.



చందుర్తి: మండలంలోని ఆశిరెడిపల్లె గ్రామ శివారులో వ్యవసాయ పొలాల మధ్య ఉన్న విద్యుత్ స్తంభం వంగిపోయి ప్రమాదకరంగా మారింది. ఆర్అండ్‌బీ రోడ్డుపక్కనే విద్యుత్ లైన్ ఉండడంతో ఈదురుగాలులు వస్తే స్తంభం కూలిపోయి విద్యుత్ తీగలు రోడ్డుపై పడే అవకాశం ఉంది. ఇప్పటికైనా సెస్ అధికారులు స్తంభాన్ని సరిచేసి ప్రమాదం జరగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
మహేశ్, సెస్ ఏఈ, చందుర్తి. సెల్ నెం: 9440814077

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించని బీజేపీ



మాట్లాడుతున్న స్కైలాబ్ బాబు

సిరిసిల్లకల్చరల్: పట్టభద్ర నిరుద్యోగులకు ఉపాధి కల్పించలేని బీజేపీని రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. గురువారం అమృతలాల్ శుక్ల భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఏనాడూ పట్టభద్రుల సమస్యలను ప్రస్తావించలేదని విమర్శించారు. నిరుద్యోగుల పక్షాన నిరంతం పోరాడేది సీపీఎం అన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమవుతున్న తరుణంలో మతోన్మాద శక్తులు పెరిగే ప్రమాదం ఉందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ వైఖరిని వెల్లడించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మూషం రమేశ్, కోడం రమణ, గన్నేరం నర్సయ్య,, నాగరాజు, సూరం పద్మ, అన్నల్‌దాస్ గణేశ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల సంబరాలు



ముస్తాబాద్: ఢిల్లీ సీఎంగా రేఖా గుప్తా ప్రమాణస్వీకారం చేయడంపై ఆర్యవైశ్య సంఘం నాయకులు మండలకేంద్రంలో గురువారం సంబరాలు నిర్వహించారు. పటాకులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. స్వామి వివేకానంద విగ్రహం నుంచి రేఖాగుప్తా చిత్రపటంతో ర్యాలీ చేపట్టారు. రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు ఆర్యవైశ్యులకు రాజకీయాల్లో అవకాశాలు కల్పించాలని కోరారు. ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు కూర సంతోష్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు విజయ్‌కుమార్, గందె చంద్రం, చంద్రం, భిక్షపతి, సుదర్శన్, రమేశ్, నగేశ్, శ్రీని వాస్, కృష్ణమూర్తి, రాజు తదితరులు పాల్గొన్నారు

భవన నిర్మాణాలకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అంగన్‌వాడీ సీడీపీవో, సూపర్‌వైజర్లు

చందుర్తి: మండలంలోని బండపల్లి, చందుర్తి గ్రామాల్లో అంగన్‌వాడీ పక్కా భవనాల నిర్మాణాలకు ఐసీడీఎస్ సీడీపీవో సౌందర్య, సూపర్‌వైజర్ శంకరమ్మ, ఆర్ఐ శ్రీనివాస్ స్థలాలను గురువారం పరిశీలించారు. ఏళ్ల తరబడి అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతుండడంతో పక్కా భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా స్థలాన్ని పరిశీలించారు. వారివెంట అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు ఉన్నారు.

అన్యాక్రాంత జీపీ స్థలంలో సర్వే



అన్యాక్రాంత జీపీస్థలంలో సర్వేచేసి హద్దులు వేస్తున్న సర్వేయర్, రెవెన్యూ అధికారులు

రుద్రంగి: రుద్రంగిలోని జీపీ స్థలం అన్యాక్రాంతానికి గురైందని పిట్టల నరేశ్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం వేయగా హైకోర్టు ఆదేశాలతో విచారణ చేపట్టారు. గురువారం రెవెన్యూ అధికారులు సర్వేయర్‌తో ఆ స్థలంలో సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారు. సర్వే నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు.

పోలింగ్ బూత్‌ల సందర్శన



పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో

కోనరావుపేట: మండలంలోని పోలింగ్ బూత్‌లను ఆర్డీవో రాజేశ్వర్ గురువారం పరిశీలించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను సందర్శించి వసతులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ విజయ ప్రకాశ్‌రావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

చోరీకి యత్నం.. పట్టుకున్న స్థానికులు



తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని ఇందిరానగర్‌లో గురువారం పట్టపగలు ఓవ్యక్తి చోరీకి యత్నించాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కేసీఆర్ నగర్‌కు చెందిన గణేశ్ ఇందిరానగర్‌లో తాళం వేసి ఉన్న ఓ ఇంటి తాళం పగులకొట్టేందుకు యత్నించాడు. గమనించిన స్థానికులు ఆ వ్యక్తిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

నియామకం

ముస్తాబాద్: అంతర్జాతీయ మానవహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ముస్తాబాద్‌కు చెందిన మహ్మద్ జహంగీర్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు షేక్‌గౌస్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రజాసమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని జహంగీర్ పేర్కొన్నారు.